
దావాళ్లో కల్లా అన్నదానం గొప్పదంట. పెటే చెయ్యిని కరవకూడదట. చేసుకునోళ్ళకి చేసుకున్నంత మహదేవ అంట. మా తాత రోజుకు పదిసార్లన్నా యీ సామెతలను చెబుతాడు.

అందుకేనేమో మా అమ్మ చెప్పింది– ఒకరికింత పెట్టడం వల్లనే తాత ఇంత ఆస్తి సంపాదించాడని.

మా తాతకు చాలా పెద్ద ఆస్తి వుంది. నిచ్చెనమెట్ల వెంకటేశం అంటే మా ప్రొద్దుటూర్లో తెలియని వాళ్ళుండరు. మా తాతను అందరూ కోటీశ్వరుడని అంటారు. మా తాత మాత్రం "నాదే ముందర్రా నా కంటే కుబేరులుండగా" అంటాడు.



# అన్నదాతలు

కేతు విశ్వనాథరెడ్డి

మా తాతకు పెద్ద బజార్లో చాలా పెద్ద సరుకుఅంగడి వుంది. వూళ్లోకల్లా పెద్ద బట్టల షాపుంది. చిన్న బజార్లో రెండు బ్రాందీ షాపులున్నాయి. మందుల షాపుంది. బస్టాండు దగ్గర పెట్రోలు బంకుంది. ఒక ఆయిలు మిల్లుంది. ఒక వత్తి జిన్నింగ్ మిల్లుంది. పెద్ద కమీషను మండీ వుంది. ఒక సినిమాహాలు కూడా కడుతున్నారు. మా తాత చెప్పే కుబేరులకు మా తాతకంటే యింకా యేమేమి వుంటాయో?

మానాయన చనిపోకముందు మాఅమ్మ కూడా తిరిపెగాళ్లకు లేదనకుండా అన్నం పెట్టేది. మా కెందుకు మా తాతలాగా ఆస్తి రాలేదో నాకు తెలియదు. మా తాత నా మాదిరి అయిదో తరగతే చదివాడు. మా నాయన బి.ఏ. చదివినాడు. యిది నేను మాఅమ్మతో అంటే. "మీ నాయనకు బతికేదితెల్దు" అంది. "మరి నువ్వులేదనకుండా ఒకరికి పెట్టిన దానివేనే?" అని అడిగినా. "పోయిన జన్మలో యేం పాపం చేసినానో? అంతా మన ఖర్మ" అంది. మా అమ్మ మాట్లాడితే జన్మ. పాపం. పుణ్యం కర్మ అంటుంది. నాకేమీ అర్థం కావు.

అప్పటికి నాకు తెలిసిన విషయాలు: మా నాయన నా చిన్నతనంలోనే పోయినాడు. యే వుద్యోగంలోనూ నాలుగు రోజులు కుదురుగా లేడంట ముక్కుకు సూటిగా పోవడమే నంట! వున్న కాస్త ఆస్తి మా నాయనకు వచ్చిన జబ్బుకోసం ఖర్చు అయిందట! అదెంత జబ్బో నాకు తెలియదు. మా అమ్మ మాతాత తమ్ముడి కూతురు. మా నాయన పోయినాక, మాకెవరూ దిక్కులేరు. వెంకటేశం తాతే మమ్మల్ని దగ్గరకు తీసినాడు. మా తాతకు మేము చాలా రుణపడి వున్నామని మా అమ్మ అంటూ వుంటుంది. రుణంఅంటే బాకీ. నిజానికి మా తాతకు మేమేమీ


బాకీలేము. మా తాతే మాకు బాకీ.

తాతా వాళ్ళ యింట్లో పని అంతా చేసేది మా అమ్మే. అందరికీ వంట చేసేది అమ్మే. ఒక అత్త యెప్పుడూ మంచం దిగదు. అదేం రోగమో డాక్టరు దగ్గరకు పోయేటప్పుడు మాత్రం బాగా సింగారించుకుని పోతుంది. మిగతా యిద్దరు అత్తలూ ఒక్క పని ముట్టుకోరు. రోజుకు నాలుగైదుసార్లు అద్దంముందు నిలబడడం. కుట్లు కుట్టుకోవడం. పత్రికలు చదవడం. పాటలు వినడం. యేదో ఒకటి నములుతూ వుండడం వాళ్ళపని. మా అత్తల కొడుకులూ, కూతుర్లూ చదువుకుంటున్నారు. వీళ్ళందరి పనులూ మా అమ్మే చేయాల. నేను మా తాత చెప్పేపనులు, మామలు చెప్పేపనులూ చేయాల.

మా తాతా వాళ్ళింటికి వచ్చిన మొదట్లో నన్ను కమీషను మండీలో పెట్టినారు' నా పని ఆఫీసు వూడ్చడం. టీలూ, కాఫీలు తేవడం. నా కప్పుడు పదకొండేండ్లు. మా మామ పరుపుల మీద వేసిన దిండ్లకు ఆనుకుని కూర్చునేవాడు. రెండు ఫోన్లలోనూ మాట్లాడుతూ వుండేవాడు- హిందీలో, తెలుగులో. బొంబాయి సేట్లు వచ్చిపోతూ వుండేవాళ్లు. కమిషను వ్యాపారంలో మాటలలోనే చాలా డబ్బువస్తుందని తర్వాత తెలిసింది. రాత్రిపూట పొద్దు పోయినాక మా మామ దగ్గరకి యెవరో వచ్చేవాళ్లు. నేను బ్రాందీ తెచ్చేవాణ్ణి. గంగమ్మ గుడి దగ్గరనుంచీ 'కడ్డీ చియ్యాలు' తెచ్చేవాణ్ణి. యింట్లోకి మాంసం తేకూడదు. మామ బయటే రాత్రిళ్లు తినేవాడు మా తాతది అంతా పెద్ద విష్ఠ. విష్ఠ అంటే పూజలు గీజలూ అవీ కదా!

రెండేండ్ల తర్వాత నన్ను ఆయిలు మిల్లు ఆఫీసులో పెట్టినారు. నా పని ఆఫీసులోవాళ్లు చెప్పిన పనులు చేయడం. అప్పుడప్పుడూ హైస్కూలుకు పోయే వాళ్లను చూసి నాకు చదువుకోవాలని వుండేది.

అమ్మతో ఆమాట అంటే "చదువుకొని మీ నాయనేం సంపాయించినాడు? వ్యాపారంలో అయితే యెంతన్నా మీ తాతమాదిరి సంపాయించవచ్చు. బుద్ధిగా పని నేర్చుకో. మీ తాతకు మనసుపడి గురికుదిరితే పని నేర్పుతూనే వ్యాపారంలో భాగంపెడతాడు.




నువ్వుపైకి వస్తావు. మన కష్టాలు గట్టెక్కుతాయి" అని అంటుంది.

మూడేండ్లనుంచీ నేను పని నేర్చుకుంటున్నాను. యిప్పుడిప్పుడే నన్ను తూకాలు రాయమంటున్నారు. వేరుచెనక్కాయల అవుటను రాసుకోమంటున్నారు. అన్నట్లు జ్ఞాపకం వచ్చింది. మా రెండో మామ తూకాలు బాగా వేస్తాడు. కాటా దగ్గర నిలబడితే అదే మోగావీ. కాయల వ్యాపారస్తులు తూకాలు తగ్గిపోయినాయని యేడుస్తారు. 'నమ్మినవాళ్లను మోసం చేస్తారా?' అని అడుగుతారు. 'నమ్మిన వాళ్లనుగాక నమ్మని వాళ్లను మోసం చెయ్యడమెట్లా?' అంటాడు మా మామ. లాభాలు యిద్దరికీ వస్తాయి కాబట్టి యెవరూ గట్టిగా తగాదా పడరు. అయితే



కాటా తూకం సంగతి వ్యాపారస్తులకు. రయితులకు తెలియదు. వళ్లకు యింటి దగ్గర కాటాలు వుండవు. అన్నీ గుడ్డి లెఖ్ఖలే పైగా చాలామంది రయితులు కళ్లంలోనే కట్టె తూకానికి అమ్ముతారు. మిల్లుకు వ్యాపారస్తులే యెక్కువగావస్తారు.

రోజూ అవుటను చూసే కాయలను ధర్మఖాతాలోకి వేస్తారు. సంవత్సరం సంవత్సరం పది వేలకు పైగా వస్తుంది. కంపెనీమొత్తంమీదసంవత్సరానికి లాభంలో నూటికి రూపాయ తీస్తారు. ఆలెఖ్ఖలు నాకింక తెలియవు. ధర్మఖాతా డబ్బంతా తాత తిరుపతికి పోయి ఖర్చుపెడతాడు. కొంత దేవుడి హుండీలో వేస్తాడు. కొంత ఆఫీసర్లకు ఖర్చుపెడతాడు. ప్రతి దీపావళికి అన్నదానం యేర్పాటు చేస్తాడు. శ్రీరామ నవమికి పానక పందేరం. హరికథా. ఒక సంవత్సరం తాత తనొక్కడే అమ్మవారు శాలకు యాభై వేలు యిచ్చినాడు. పుణ్యాత్ముడు అనిపేరు తెచ్చుకున్నాడు. పోయిన దసరారోజు ఒక కవి మా తాత మీద పద్యాలు రాసి అచ్చేసి పంచినాడు. మా వూర్లో అట్లాంటి కవులంటే మా తాతకు యిష్టం. అట్లాంటి కవులు మా తాత దగ్గరకు వస్తూ పోతూ వుంటారు. మా తాత వాళ్లకు పాతికా పరకా ధర్మఖాతాలో నుంచి తీసియిస్తాడు.

మరొక రెండేండ్లు గడిచినాయి. మా తాత వ్యాపారంలో నాకింకా భాగం పెట్టలేదు. ఆయనను అడుగుదామంటే

అమ్మకూ భయమే. నాకూ భయమే.

ఆమధ్య మాతాతకు పెద్దజబ్బుచేసింది. మంచంమీదే అన్నీ. మంచం దగ్గర అమ్మ తాతకు రోజుల తరబడి సేవలు చేసింది. ఆ రోజు తాత కళ్ళనీళ్ళు పెట్టు కొని "నీ రుణం యీ జన్మలో తీర్చుకో లేను సుబ్బమ్మా" అన్నాడు. అమ్మ యేడ్చింది. నా దిక్కు చూసి చూసి యేడ్చింది. తాత ఆ రోజే చచ్చిపోయి నాడు. యింట్లో అందరికంటే మా అమ్మే యెక్కువగా యేడ్చింది.

తాత పెద్దదినంరోజు అన్నదానం జరి గింది. అంత వీధినబడిన ఆకలిని నేనెప్పుడూ చూళ్లేదు. తాతకు వూరిబయట తోటలో పాలరాతితో పెద్ద సమాధి. సత్రంకూడా పాలీషురాళ్ళతో కట్టించినారు.

యేమైందో యేమో. తాతపోయి సంవ త్సరం తిరక్కుండానే మా మామలు భాగాలు పోయినారు. ఆస్తి పంపకం రోజు అమ్మ- మా తాత నా సంగతి యేమైనా చెప్పిపోయినాదేమోనని మా మామలను అడిగింది. ముందు యెవరూ వులకలేదు; పలకలేదు; రెండో మామ నాకు నెలకు రెండు నూర్ల జీతం యేర్పాట్లు చేసినాడు. నేనూ, మా అమ్మా ఒక గుడిసె తీసుకు న్నాము

మాకొక గతి చూపించి పోనందకు వెంకటేశం తాతను అమ్మ రోజుకు ఒక సారన్నా తిట్టేది. ఆమెకు నా దిగులు పెద్ద దైంది. యెక్కడ వ్యాపారంలో ఒక్క పైసా భాగం పెట్టినా నా బ్రతుకు బాగు పడేది కదా అంటుంది అమ్మ. యేం లాభం? అమ్మ తాతకు స్వంత కొడుకు కాదు

మా అత్తవైపు మార్కాపురం తుర్ర వాడెవరో రావడంతో నన్ను మిల్లులోకి మార్చినారు. ఎక్స్పెల్లర్లదగ్గరా, డికార్టి గేటర్ల దగ్గరా కూలోళ్ళతో నేను పని చేయించాల.

ఆ పనిలో చేరిన రోజే వవ్వు చెరిగే ఒకామె నన్ను చూసి "వీళ్ళతాత దరమ దాత. బతికుంటే మిల్లులో యీ అయ్యకు బాగం పెట్టేవాడు" అని అంది. డికార్టి గేటర్ దగ్గర పని చేసే రమణయ్య నవ్వుతూనే అన్నాడు: "తాతా ధర్మా త్ముడు కాదు మామలూ కాదు. యీ అయ్య కూలోళ్లమీద కూలోడు కావలసినవాడే." రమణయ్య ఎగతాళికి నాకు కోపం వచ్చింది. కసురుకున్నాను. "ముందువని గానీ బెల్టు తెగిపోయిందిచూడు" అంటూ. రమణయ్య నవ్వడం మాత్రం ఆపలేదు. బెల్టుసరిచేసి అన్నాడు. "మాలో వాడివే అవి సరదాగా అన్నాను. మీ తాత మామల భాషమాత్రం నేర్చుకోవద్దు. వాళ్ల వాళ్ళే. మనం మనమే."

నాకు మరింత కోపం వచ్చింది. కానీ రమణయ్య నవ్వుముఖం చూస్తే నోరు పెగలలేదు. నా కంటే రమణయ్య ఏ అయి దేండ్లో పెద్దయివుంటాడు. మాట్లాడకుండా అక్కడనుంచి పోయినాను.

ఆ రోజంతా రమణయ్య మాటలే జ్ఞాప కం వచ్చినాయి. రమణయ్యకూ లేదా మిల్లు లోని యితర కూలోళ్లకూ నాకూ తేడా యేముంది? నాకంటే రమణయ్యకు యెక్కువ జీతం. నేను రమణయ్యకంటే యేరకంగానూ యెక్కువ కాదు-కులంలో తప్ప. ఆ రాత్రి మా అమ్మ మామూలు గానే మా తాతమీద యేదో సణిగింది. యింత భాగంపెట్టి పెళ్లికూడా చెయ్యలే దంటూ. నాకేమైందోకానీ- మా తాతనూ, మామలనూ, డబ్బున్న వాళ్లనూ నాయిష్టం వచ్చినట్లు తిట్టినా. ఆ రోజు తర్వాత మా అమ్మ మా తాతను నాముందు తిట్టడం మానేసింది. ఆరోజు తర్వాత కూలివాళ్లను నేను కసురుకోలేదు. కూలివాళ్లను నెత్తి కెక్కించుకొంటూ పని చెడగొడుతున్నా నని మామ ఒకసారి కేకలు వేసినాడు.

మా అమ్మ నేను లక్షాధికారి కాకుం డానే, నా పెళ్లి చూడకుండానే చచ్చి పోయింది. నా జీతం అంతవరకు ఒక్క దమ్మిడీ పెంచని మా రంగయ్య మామ, మా అమ్మ పెద్ద దినం రోజు ఖర్చంతా భరించినాడు. నా జీతమే పెంచివుంటే, మరింత మంచితిండి తిని మా అమ్మమరి కొన్నేండ్లు బ్రతికి వుండేది.

నా ఒంటరి బ్రతుక్కు యిప్పుడు రమణయ్య తోడయ్యాడు. రమణయ్య ద్వారా నాకు చాలా విషయాలు తెలిసివస్తు న్నాయి. వత్తిరాట్నాల దగ్గర పనిచేసే రమణయ్య చెల్లెలు పార్వతిని నేను పెళ్లి చేసుకున్నాను. దాంతో మా తాత కుటుం బంలోవున్న ఆ కులబంధంకూడా తెగి పోయింది. పెళ్లయినాక, జీతం పెంచమని అడిగినాను. పిండిమిల్లు కట్టడంలో చాలా యిబ్బందులు పడుతున్నాననీ, మిగతా వ్యాపారాల్లో నష్టాలు వచ్చినాయనీ నా జీతం పది రూపాయలు పెంచినాడు.

ఆ నెలలోనే మా తాత తద్దినం. పెద్ద సంతర్పణ. రాత్రి హరికథ.

మరునటి రోజే, ఎక్స్పెల్లరు దగ్గర పనిచేసే ఏసు ప్రమాదంలో చనిపోయి నాడు. ఏసుదే పొరపాటని తేల్చినారు. పెద్దమామ ఆఫీసర్లతో మాట్లాడినట్లు తెలి సింది. నష్టపరిహారం కింద ఆరుమంది

## మున్సిపాలిటీ కవితలు

### స్ట్రీట్ లైట్

చీకటిపడ్డాక వెల్తురు ఇస్తే
నాలా రాళ్ళ దెబ్బలు తినాలని
తెలిసే కాబోలు వెళ్ళిపోయాడు
సూర్యుడు చీకటిపడుతూనే.

### వీధి కుళాయి



ఈ ప్రభుత్వోద్యోగుల కంటే
నేనే నయం ఎండైనా, వానైనా
కనీసం గంటైనా రోజుకు
చేస్తున్నాను నా పనిని.

### రోడ్డు రోలరు

బలిసాను అవినీతిలా ఇంత
లావుగా, అని ఏడవనక్కర్లా
నన్నుచూసి, నేను రాళ్ళను
నమిలి మీకు రోడ్లు వేస్తున్నా.

—సి. వి. ఎస్. శోభన్‌బాబు

# పగలు + రాత్రి = ఉదయం

**పగలు**

పగలు నేను
విచ్చుకునే పువ్వుని
ఎగిరే పక్షిని
వికసించే ఇంద్రధనుస్సుని
మరకలేని తెల్లని ఆకాశాన్ని!

**రాత్రి**

రాత్రి
నా ఆశల శతనేత్రి
రాత్రి
నా కలలు మేల్కొనే హేమగాత్రి
రాత్రి
ధరిత్రికి సుషుప్తికి ప్రగాఢమైత్రి
రాత్రి
నాకు మాత్రం
నా ఆర్తి బుసలుకొట్టే వీతిహోత్రి!

**ఉదయం**

రాత్రి చీకటి విడిపోయి
ఉదయం వెలుగురేకలు విచ్చుకొనే సంధి
సమయంలో
స్తంభించిన చైతన్యాన్ని తట్టి లేపుతుంది
నా హృదయం!
ఉదయం సంధ్యలో వేలాడే
ట్రాన్స్‌లూసెంట్ చీకటిలో




లీలగా పీలగా వినిపించే
సంగీతానికి స్వరాలు కూరుస్తుంది
నా హృదయం!
కలకీ వాస్తవానికీ మధ్య
పల్చటి పరదా వెనుక
అస్పష్టంగాకదిలే రాగాల్ని ఏరుకొంటుంది
నా హృదయం!
సంవత్సరాలుగా నిలబడిన
రాళ్ళగుట్ట గుట్టుమట్టుపెట్టి
దాని పుట్టకీళ్ళు కదల్చడానికి
ఒక చిన్ని మర్రి విత్తు చాలు!
రాత్రి తిమిరం కమ్మిన తిమ్మిరిని
దుల్లగొట్టేందుకు
ఉదయం గాలిమీద మందమందగా తేలి
వచ్చే
గోరింట పూల వాసన చాలు!
రవంత వగరు!
మరింత కమ్మదనం!!
దాని తాకిడికి అక్షరాలు పుష్పించి వికసిస్తాయి!
మాటలు లేత రెమ్మలు తొడుక్కొంటాయి
అప్పుడు నేను బిగించి భాషను శ్రుతి చేస్తాను!
సన్నగా మీటినా అది అద్భుత స్వరాల నొలకబోస్తుంది!
జగతిని సునాద వినోదమయం చేస్తుంది!!


—శశికాంత్ శాతకర్ణి

పిల్లలు, యిద్దరు ముసిలోళ్ళూవున్న ఏసు కుటుంబానికి వెయ్యిరూపాయలిచ్చినారు. ఏసు యిరవై అయిదేండ్ల నుంచి మిల్లులో పనిచేస్తున్నాడు.

రమణయ్య నేరుగా మా మామ-కాదు మా మిల్లు ఓనరు నిచ్చెనమెట్ల రంగయ్య దగ్గరకు వెళ్లి "చచ్చిపోయిన మీ నాయన ఖరీదులో వెయ్యోవంతు చెయ్యడా ఏసు?" అని అడిగినాడు, యింకా దులిపినాడు. "మీరు పెట్టే చెయ్యిని కరిచేవాండ్ల"వి రమణయ్య మీద రంగయ్య కేకలు. చేసుకున్న వాళ్లు చేసుకున్నంత అనుభవిస్తారని శాపనార్థాలు. ఆ భాషంతా అచ్చం మా తాతదే. తేలిపోయింది.

రమణయ్యను వుద్యోగంలోనుంచి తీసివేసినాడు. సమ్మె మొదలయింది. మిల్లును బలవంతంగా రంగయ్య మూసివేసినాడు. గొడవలు గొడవలుగా వుంది. రాయబారాలూ, రంపులూ. పనివాళ్ళ తిప్పలను కళ్లారా చూసినా. అనుభవించినా.

యీలోగా యిండస్ట్రియల్ యెస్టేటులో రంగయ్య తెరిచిన కొత్త ఇండస్ట్రీకి మంత్రి ప్రారంభోత్సవం చేసినాడు. దాని



పేరు 'నిచ్చెనమెట్ల వెంకటేశం అండ్ సన్స్ ఫ్లోర్‌మిల్. మా తాత పేరుమీదుగా సంతర్పణ; ఒక అనాధ బాలుర అన్నదానం మందిరం ఏర్పాటు చేస్తున్నట్లు సభలో ప్రకటన. ప్రశంసలూ, పద్యాలూ- రంగయ్యది తండ్రిలాగే పెట్టేచెయ్యి.... వాళ్ళ వంశమే కర్ణుడు, శిబి చక్రవర్తుల వంశమని..

మిల్లు మూసి మూడు నెలలయింది. వెయ్యిమంది ఆడామగా, పెద్దాచిన్నా, పిల్లాపాపా, ముసలీముతకా కడుపులు చేత్తో పట్టుకుని....పండగల అన్నదానం కోసం కాదు! తద్దినాల సంతర్పణ కోసం కాదు! పనికోసం; న్యాయం కోసం.... నేను అందరితో కలవడం చూసి తాత వారసులు నాకు విశ్వాసం. లేదంటున్నారు నిజమే, నేను కుక్కను గానందుకు సంతోషిస్తున్నాను.

(విశాఖ ఆకాశవాణి సౌజన్యంతో)